మబ్బులు

ఆవూరి చెరువు ఎండిపోయింది. చెరువులో నీళ్లుండేనే, అక్కడి బావుల్లో నీరు. భూములు బీటలు బారినాయి. పంటచేలు ఎప్పుడోపాడైపోయినవి.

జనం మైళ్ళకొద్ది దూరం పోయి, కుండలలో నీళ్ళు తెచ్చి, తెచ్చుకోలేనివాళ్ళకు అమ్ముకుంటున్నారు. కొందరు మంచినీళ్ళకు బదులు కల్లు తాగి కూడా ఉంటున్నారు. కల్లు రెండింటికీ పని చేస్తూంది. ఒకటి ఆకలికి, రెండోది దాహానికి. జనం ఆకలినిమరవ డానికి సారా కూడా తాగుతూ, సారా త్రాగడానికి అప్పులు చేస్తున్నారు. ధాన్యంధర పెరగదు. కల్లుసారాధరలుమాత్రం ప్రభుత్వమే పెంచేస్తోంది. అయినా తాగేవాళ్ళు తాగుతూనె ఉన్నారు.

అది వర్షాకాలమైనా, ఎండకాలంలా ఉంది. జనం చెట్ల నీడన చేరి "వర్షాలు ఎందుకు రావడం లేదోనని" చర్చిస్తున్నారు. ఇప్పటివరకు గడిచినా, ఇంక ముందెట్లా గడుస్తుందోనని ఆలోచిస్తున్నారు.

కప్పలకు పెండ్లిచేసి, ఆడవాళ్ళు పాటలుపాడుతూ ఊరంతా తిరుగుతున్నారు.

ఈ పరిస్థితుల్లో గ్రామ పంచాయతీ మీటింగు పెట్టి, పరిస్థితులనుచర్చిస్తున్నారు. ఆ గ్రామపంచాయతీ సభ్యులు

సర్పంచ్ చంద్రరావు "వర్షాలు లేక గ్రామ పరిస్థితి ఎలా ఉందో అందరికీ తెలిసిన విషయమే. ప్రభుత్వం వాళ్ళిచ్చిన గడ్డి అందరికీ పంచడం జరిగింది. కరువు నివారణ కింద ఇచ్చిన పనులు పూర్తి చేయించడం జరిగింది. రెండు బోరింగులను కూడా వేయించడం జరిగింది. మన వూరి దురదృష్టం, వాటిల్లోను నీరు పడలేదు. అంతేకాదు. నేను సర్పంచ్‌గా ఉన్నప్పుడే ఈ కరువు రావలెనా?

దీన్ని బట్టి నేను దురదృష్టవంతునిగానే భావించు కుంటున్నాను. ఊళ్ళో జనం కూడా నానారకాలుగా మాట్లాడ్డం నేను విన్నాను. పాపం పెరిగి పోయిందట, చిన్నా-పెద్దా బేదం లేకుండా పోయిందట, ఆడ-మగ తేడా లేకుండా పోయిందట. పెండ్లి కాక ముందే కడుపు చేసుకుంటుండ్రట. ముండరాళ్ళు కడుపు తీయించు కుంటుండ్రట మొన్న చనిపోయినామె గర్భవతి అని, ఆమెను అలాగె పాతి పెట్టడం వలన వర్షాలు

రావడం లేదట, అసలు ఎవరో మంత్రగాడు వర్షం రాకుండా కట్టు కట్టాడట. ఇన్ని జరుగుతున్నా, నేను ఏమి పట్టించుకోవడం లేదట. అంతేకాదు మనసభ్యుల్లో కూడా కొంతమంది మీటింగ్ పెట్టుకొని, రాధాబాయి గారిని సర్పంచ్‌గా చెయ్యాలని నిర్ణయించుకున్నారట. అవిశ్వాస తీర్మానం నెగ్గడానికి, కావలసిన సభ్యుల బలం ఆమె వైపు కనిపిస్తూనే ఉంది కాబట్టి నన్ను దించేసినా, నేనే దిగిపోయినా, ఈ పరిస్థితుల్లో రెండూ ఒకటే, అందుకని నా రాజీనామాను ఆమోదించవలసిందిగా కోరుతున్నాను'' అంటూ చంద్రరావు కూర్చున్నాడు.

రాజీనామా ఆమోదిస్తూ, రాధాబాయిగారిని సర్పంచ్‌గా ఎన్నుకుంటూ, తీర్మానాన్ని వ్రాయించారు. పంచాయితీ బోర్డు పరిచారకుడు తెచ్చి తమ తమ ఎదుట రిజిస్టర్ ఉంచినపుడు సంతకాలు చేస్తున్నారు. వేలి ముద్ర వేసే వాళ్ళ కోసం యింక్‌పాడ్‌ను, సంతకం చేసే వాళ్ళకోసం ఓ పెన్నును, రిజిష్టరుతో పాటు మోసుకుపోతున్నాడా పరిచారకుడు.

అందరితో పాటు రాధాబాయి సంతకం చేసి లేచి "నా మీద ఉంచిన ఈ బాధ్యతను సరిగ్గా నెరవేర్చడానికి మీ అందరి సహకారాలు ఉంటాయని, ముఖ్యంగా మన గత సర్పంచ్ చందరావుగారి సలహా సహకారాలు లేకుంటే నడప లేనని, వారి దయ తప్పక నామీద, ఈ ఊరిమీద ఉండాలి" అని రెండు చేతులు జోడించి చంద్రరావు వైపు మళ్ళింది. అందరూ చప్పట్లుకొట్టారు.

చంద్రరావు చిరునవ్వుతో సర్పంచ్ స్థానం నుండి లేచి రాధాబాయి కూర్చున్న కుర్చీవద్దకు వచ్చి, ఆమెను సర్పంచ్ స్థానంలో కూర్చోమ్మని చేయితో ఆ కుర్చీని చూపిస్తూ, కళ్ళతో సైగ చేశాడు. ఐదున్నర అడుగుల విగ్రహం- నిండా నిండిన సంతోషాన్ని కళ్ళు ప్రకటిస్తుండగా, ఆనందంతో అడుగులేస్తు, ఆడ తనాన్ని దాయలేని పైటను గుంజి, గుంజి కప్పుకుంటూ, వెళ్ళి అధ్యక్ష స్థానంలో కూర్చుంది.

మళ్ళీ చప్పట్లు....

పదవీ బాధ్యతలు తీసుకున్నట్లు సంతకాలు చేసింది.

ఆమె కట్టుకున్న పోచంపల్లి పట్టుచీరలో ఎంతో పొంకం గా వుంది. తెల్లని నుదుట పెట్టుకున్న ఎర్రని కుంకుమ బొట్టు ఆమె ముఖానికి అందాన్ని ఇస్తూనే, దాని కదే ఓ కొత్త అందాన్ని సంతరించుకుంది.

ఆమె అందరివైపు ఒక్కసారి చూసింది. "ఆ చూపులు మత్తెక్కించే మంత్రాలు" పైసలు చల్లి పంచాయతీ సభ్యునిగా ఎన్నికైన ఆ ఊరి షావుకారి శంకరయ్య ప్రక్కనే కూర్చున్న సభ్యునితో చిన్నగా అన్నప్పుడు, అవును అన్నట్టు తల ఊపుతూ, ఆ సభ్యుడు ఆమెవైపే చూస్తున్నాడు. అందరికీ

కృతజ్ఞతా పూర్వకంగా చేతులు జోడిస్తూ లేచి ముసి ముసి నవ్వులతో ప్రొద్దు తిరుగుడు పూవులా తిరిగింది. ఆ నాటి సభ ముగిసింది.

* * *

అదే రాత్రి రాధాబాయి ఇంట్లో ఓ గదిలో తన వర్గం సభ్యులందరికి సారా, కోడి వేపుడు అందిస్తూ ఉంది ఆ పూట ఏ సభ్యునికి ఆ ఊళ్ళో కరువున్నట్లు గుర్తులేదు. వాళ్ళు తమను తామే మర్చిపోయే ఖాళీ అవుతున్న గ్లాసులను మాత్రం గుర్తుంచు కుంటున్నారు. కిరోసిన్ దీపం కాంతిలో సారా జాడీ దగ్గర తాను స్వయంగా కూర్చొని, సారా నింపి ఇస్తుంది.

అమాయకత్వానికి ప్రతినిధి అయిన ఆమె భర్త వంట గదిలో ఉండి కోడి వేపుడును మోస్తు, మధ్య మధ్య సిగిరెట్లకూ అగ్గిపెట్టలకూ బయటకు వెళ్ళివస్తున్నాడు. పిల్లలు లేని ఆ యింట్లో వేరే సందడి లేదు, సారా తాగకుండా, తన కోసం తెప్పించిన బీరును మాత్రమే తాగుతున్న షావుకారు శంకరయ్యకు ఇంకా నిషా ఎక్కలేదు. అతని చూపులన్నీ ఉండవలసిన చోటనే ఉన్నాయి. గ్లాసు నింపి ఇస్తున్నప్పుడల్లా ఓ చేత్తో గ్లాసును అందుకుంటూ మరో చేత్తో గాజులను తాకకుండా ఆ పై భాగాలనూ తాకుతూ తన్మయత్వం పొందుతున్నాడు. ఇక్కడ ఓటు యివ్వడమే గాకుండా, ఏన్నో ఏండ్ల నుండి ఆమె చేసే సారా వ్యాపారానికి పెట్టుబడి పెడుతూ వస్తున్నాడు. అసలు

తప్పకుండా యిస్తు మిత్తి కింద తాను వస్తూ పోతూ ఉంటుంది. షావుకారే కాకుండా, అందరూ ఏదో చెప్పలేని అనందంతో మునిగి తేలుతున్న నవ్వులు, అక్కడ కోరికలు కొట్లాడుతున్నాయి. చూపులు తోవ దప్పుతున్నాయి. సైగలు సిగ్గు విడుస్తున్నాయి. స్పర్శలు తావులు తప్పుతున్నాయి. ఉన్నట్టుండి దీపం చిన్నదైంది. అంతమత్తులో ఉన్న ఆ గదిలోని, మగవాళ్ళను కొన్ని గాజుల చేతులు చిత్తుచేస్తున్నాయి. వెలుతురు సరిగ్గాలేని ఆ గదిలోకి వచ్చిన వాళ్ళెవరైంది గుర్తించడం ఇతరులెవ్వరికైనా తెలవడం కష్టంగానీ, వాళ్ళను అరంజ్‌చేసిన రాధాబాయికి మాత్రం తెలిసేఉంటుంది.

రాధాబాయికి ఇంకా చాలాచాలా విషయాలు తెలుసు. ఆమె పల్లెకాకుండా, పట్టణాలు కూడా తిరుగుతుంది. కాబట్టి పట్నవాసపు ట్రిక్కులు తెలుసు. అమె కొన్నేండ్లనుండి సారా కాంట్రాక్టు చేస్తుంది. కాటట్టి ప్రభుత్వపు కార్యాలయాలలో పని ఎలా ఏమిఅనేది తెలుసు. పైరవీలను ఏలా నెగ్గించుకోవాలో తెలుసు.

''నమస్కారం! సార్! నేను రాధాబాయిని సంఘసేవకురాలిని'' అంటూ ఆఫీసర్ల గదుల్లోకి పురి విప్పిన నెమిలిలా నడిచి వస్తుంటే చేయి లేవడం తప్ప నోట మాటరాదు వాళ్ళకు.

"కూర్చోవచ్చాండీ" అంటు కొంగు సవరిస్తు పేర్చిన

బతకమ్మలా ఎదుటి కుర్చీలో కూర్చున్నపుడు, గదిలో స్విచ్ నొక్కితే వెలుతురు పరుచుకున్నట్లుగా, కూర్చున్న కుర్చేకాదు ఎదుటి టేబుల్ చుట్టూర, ఆఫీసర్ ముఖం నిండా, చివరికి అక్కడ నిల్చున్న బంట్రోతు కళ్ళనిండా అందం, ఆనందం పరుచు కుంటుంది.

"ఈ పనిని మీరు తప్పక చేసి పెట్టాలండీ" అంటూ, ఆమె నవ్వే నవ్వుకు, తట్టుకోలేక ఫైల్ తెమ్మని చెప్పటం కోసం టేబుల్ మీది కాలింగ్ బెల్‌ను నొక్కుతూ, ఆ బెల్‌వైపే చుస్తున్నప్పుడు, దాని నిక్కల్ మెరుపులో ఆమె నవ్వుముఖమే........

"మీ రెట్లంటే అట్లనే. తీర్థం....తీర్థమే, ప్రసాదం....ప్రసా దమే'' అంటూ చెప్పును వదిలిన ఆమె పాదాన్ని టేబుల్ కింద నుండి ఆఫీసరు కాలు కిందికి చొప్పించినపుడు, శరీరం అదుపు తప్పుతూంటే, నిలతొక్కుకోవడానికి కుర్చీలో వెనక్కు వాలి,పైన తిరిగే ఫ్యాన్ వేపు చూసినపుడు ఆ ఫ్యాన్‌కింది స్టీల్ భాగంలో ఆమె జాకెట్ వదిలిన భాగాలు కనిపిస్తుంటే, ఏ పనికాదు? అర్జంట్ పనులు అతి ముఖ్యమైన పనులున్నప్పుడు, డాగ్ బంగ్లాలో బస చేస్తూ ఉంటుంది. సినిమా హాల్లో పక్కన కూర్చొని టైం పాస్ చేస్తూవుంటుంది. నవ్వుతూ, నవ్విస్తుంటుంది. తాగుతూ, తాగిస్తూ, తింటూ తినుపిస్తూ ఉంటుంది— అమె ఏదిచేసినా పని చేసి పెట్టమంటుందే కానీ పైసలు కోరదు. పనికిరాని వాళ్ళవైపు కూడా చూస్తుంది. నవ్వుతుంది. మాట్లాడుతుంది. కానీ కలిసి నడవదు. కలవమని చెప్పదు. ఎప్పుడో చిన్నప్పుడు కొంచెం

చదివిన చదువుకు, పది మందిలో తిరిగిన అనుభవం తోడై వార్తాపత్రిక చదవడానికీ నలుగిరితో మట్లాడటానికి వీలైంది ఆమెకు. ఇప్పుడామె గ్రామ సర్పంచ్.

రోజు తాగే రాధారాయి, ఈ రోజు తాగలేదు. తాను సర్పంచ్ అయిన సంతోషాన్నికూడా తాగలేదు. ఆమె తలనిండా ఏవేవో ఆలోచనలు, తెల్లారేముందు అందర్నీ వాళ్ళ వాళ్ళ ఇండ్లకు పంపి, గడియ వేసుకునిపడుకుంది. కానీ నిద్రఎప్పుడో తేలిపోయి దాని స్థానే, తాను ఊరికి ఏదన్నా చెయ్యాలన్న ఆలోచనలే.

ఈ ఊరికి బడి తెప్పించగలను. కరెంటు తెప్పించగలను. ఈ రెండింటి వల్లా ఊరి బ్రతుకే మారుతుంది. కానీ ఇప్పటి కరువు తీరేదెట్లా? 'వర్షం కురిసేదెట్లా?' గుడి కట్టించడం చంద్రావే చేశాడు. వర్షం కురువాలని పూజలు, సాకలు పోయించడం, హరికథలు చెప్పించడం, అంతా ఆయనే చేశాడు. వెనకటి నుండి వచ్చే ఆచారాల ప్రకారంగా, వర్షాలు కురవనపుడు చేసే పని ఒకటి మిగిలి ఉంది. దాన్ని తాను చెయిస్తే సరి. కానీ చాలా కష్టంతో కూడిన పని అనుకుంటూ నిద్రలోకి జారుకుంది.

* * *

నెలరోజులు గడిచినా వర్షాల్లేవు. ఊళ్ళోజనం పూట గడవక పస్తులతో చస్తున్నారు. మంచి నీళ్ళ విషయం సరేసరి.

ఊళ్ళోకోళ్ళు, మేకలు, గొర్రెలు అన్నీ పట్టణానికి తరలిపోయినవి. కుదవబడ్డ నగలు తెగనమ్మ బడ్డవి. యివన్నీ మాత్రం ఎన్ని రోజులు సరిపోతాయి. ఇంత కరువు గతంలో ఎన్నో సంవత్స రాల క్రింద తప్ప, ఈ మధ్య ఎప్పుడూ రాలేదని, పెద్ద వయసువాళ్ళు చెప్పుకుంటున్నారు. అన్నింటి కంటే నీళ్ళదే పెద్ద సమస్య అయి కూర్చుంది.

బోరువెల్స్లోనే నీటి జాడలేదు. అందువల్ల బావి తవ్వించే విషయం మరచి పోవల్సి వచ్చింది. జిల్లా నాయకులతోనూ, అధికార్లతోనూ మాట్లాడినా వెంటనే ఫలితం కనిపించలేదు.

ఊరంతా డప్పు చాటింపు వేయించి పూజలు జరిపిస్తూనే వుంది. సాకలు పోయి వస్తూనే వుంది. ఈ వర్షం కోసం జరిపే ప్రతి కార్యంలో కులమత భేదం లేకుండా, ఆడ, మగ అందరూ సహకరించవలసిందిగా కోరుతూ వస్తుంది.

సిద్ధాంతులను పిలిపించి, పంచాంగం చూపించింది. పం డితులను పిలిపించింది. సలహాలను అడిగింది. అనుకోకుండా హైద్రాబాదుకు వెళ్ళొచ్చి, ఆ రాత్రికి వరదరాజుల గుడి దగ్గరకు రావల్సిందిగా తనకు సన్నిహితులైన స్త్రీలకు చెప్పింది.

మరునాడు ముగ్గురుగాక మరో ఇద్దరూ వాళ్ళంతట

వాళ్ళే వచ్చారు. మూడవనాడు ఈ రెండు రాత్రులు జరిగిన సంగతి మరి కొందరికి తెలిసింది కాబోలు ఆ రాత్రి ఏడుగు రొచ్చారు.

తెల్లారి చాలామంది స్త్రీలు రాధాబాయిని కలిసి మాట్లాడారు. ఊరంతా ఒకటే గుస గుస. ఆ రోజు ఆకాశం మబ్బు చేసింది. జనం కళ్ళల్లో కొత్త ఆశలు మెరుస్తున్నాయి.

మొదటిరోజు గుడిచుట్టూ, రెండోరోజు కాలువల్లో, మూడవ రోజు దున్నిన నాగలి చాళ్లల్లో, బావి చుట్టూ, కుంటల్లో, చెరువుల్లో, ఏడవ రోజు మళ్ళీ వరదరాజుల గుడి ఎదురుగ....

ఆ రోజు వెన్నెల పిండారబోసినట్టుంది. మధ్యలో రాధాబాయి చుట్టూర తలంటు స్నానం చేసిన మిగతా స్త్రీల తల వెంట్రుకలు భుజాల మీదుగా జారి, వీపు కింది భాగాన వేలాడుతున్నవి. ఎవరి వంటి మీద నూలుపోగు కూడా లేదు. చెక్కిన శిల్పాల్లా వాళ్ల నగ్న శరీరపు ఎత్తు ఒంపులు వెన్నెలలో మెరిసి పోతున్నాయి. గాలి తాకినప్పుడల్లా పులకరించిపోతూ, మబ్బులు చూస్తున్నాయని సిగ్గుపడి పోతూ, కళ్లు మూసుకుని జపం చేస్తున్నారు. ఈ రాత్రి ఈ వెన్నెల కురిసినట్టే, రేపు వర్షం కురవాలని వాళ్ల కోరిక. ఆ రాత్రంతా అలాగే గడిపారు.

మరునాడు సూర్యోదయం అయినట్టు లేదు. ఆకాశం నిండా మేఘాలు, ఉరుములు, మెరుపులు, వర్షం! వర్షం!!

ఎడతెరపిలేని వరదతో. వాగులు వర్షంతో కుంటలు, చెరువులు నిండాయి. జనం ఇంట్లో నుండి బయటికొచ్చి వర్షంలో తడుస్తూ, ఒకరితో ఒకరు సరసాలాడుతూ, తమ తమ సంతోషాన్ని వెలి బుచ్చుకుంటున్నారు. పిల్లలు వర్షంలో తడుస్తూనే ఆడుకుంటూ, చూర్ల క్రింద నిలుచుని కాగితం పడవలను వదులుతున్నారు. కొందరు కురుస్తున్న ఇండ్లల్లోనినీళ్ళను బయటకు తోడి పోస్తున్నారు.

రాధాబాయి గొడుగు పట్టుకొని ఇల్లిల్లు తిరిగి తన సంతోషాన్ని వ్యక్తం చేస్తూ ఇతరుల సంతోషంతో పాలు పంచుకుంటుంది. ముఖ్యగా ఆ ఏడు రోజులు తనతో సహకరించిన ముత్తయిదువులను మెచ్చుకుంటూ, కన్నెలకు కనుగీటుతూ ఒక్కటే గుసగులు, గిల్లు కోవటాలు.

మధ్యాహ్ననికిగాని వర్షం తగ్గి ముసురు మొద లయ్యింది. ఆరోజు ఆమె సారా బేరం కూడా చాలాబాగా బాగా సాగింది.

ఓ చేత్తో గొడుగు పట్టుకుని మరో చెత్తో పంచపైకెత్తి పట్టు కొని షావుకారి శంకరయ్య మెల్లగ రాధాబాయి యిల్లు చెరాడు. వర్షపు చిత్తడివల్లా వొల్లంత చల్లగనిపించిన మనస్సుల్లో వెచ్చ వెచ్చని కోరికల ఒల్లు విరుపులు.

◆ ◆ ◆

హైద్రాబాద్‌లోని ఓ ఫైవ్‌స్టారు హోటల్లోని ఏ.సి రూం.లోని టీపాయ్‌మీద తాగి వదిలిన గ్లాసుల్లోని ఐస్ ఇంకా కరుగుతూనే ఉంది. ట్యూబ్ వెలుతురు లాగే తెల్లని ఫోంబెడ్ మీద ఒకరి కౌగిలిలో మరొకరు

"ఎప్పుడు వర్షం వస్తుందో! ఇంత కరెక్టుగా ఎలా చెపుతారండీ?'' అంటూ ఆమె తన చూపుడు వేలితో అతని పెదాలపై దరువేసినట్టుమెత్తగాకొడుతూ అడిగింది.

''రుతుపవనాల ప్రయాణవేగాన్ని బట్టి ఎప్పుడు వర్షం రానుందో గూడా, నిర్ణయించి చెప్పగలం'' అంటూ ఆమె పైకి వంగి పెదాల మీదా ముద్దు పెట్టుకున్నాడు.

"అబ్బా ముద్దా? ముద్దేరా!"

''అద్దిన వాడికెలా తెలుసుతుంది'' అనగానె తన మునివేళ్లతో అతని పెదాలనుమూస్తు

"మొత్తం మీద మీ పుణ్యమా అంటూ మా ఊళ్ళోనే కాదు. మా ఏరియాలోనే నా విలువ పెరిగి పోయింది.వచ్చేసారి పంచా యతీ ఎన్నికల్లో మండలానికి ప్రెసిడెంట్ నేనే" అంటున్న రాధాబాయి కళ్ళల్లో కొత్త ఊహలు కదిలాయి.

తన ఊరు' ఆ ఊరి ప్రజలు గుర్తు రాగా, "వట్టి ఎడ్డి

మాలోకం" అనుకుంటూ తనలో తాను నవ్వుకుంది.

తీయగ తనలో తాను నవ్వుకుంటున్న ఆమెనే చూస్తూ-

"హూ" అంటూ కనుబొమ్మల్ని పైకి కదిలిస్తూ ఆమె రవిక ముడిని విప్పుతు-

"ఏదీ అక్కడ మీ 'ఊళ్ళో వర్షం కోసం' రాత్రులలో ఏ భంగిమలో........

ఇక్కడ ఈ రాత్రి నాకోసం కూడా...." అంటూ ఆమె చీర కొంగును లాగుతున్నాడు, వాతావరణపరిశీలనశాఖ డైరక్టరు రంగనాధన్.

టీ పాయ్ మీదున్న గ్లాసుల్లోని ఐస్ పూర్తిగా కరిగి పోయింది.